క్లుప్తంగా

ఓటరు స్లిప్పుల పంపిణీ



కనగల్ : మంచినీళ్లబావిలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్వోలు

కనగల్ : త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పుల పంపిణీని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం బీఎల్వోలు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 36000మంది ఓటర్లు ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మే 6వరకు వీటిని పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 12రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైన ఒకటి తీసుకువచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

చండూరులో..

చండూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చండూరు, గట్టుపల్ మండలాల పరిధిలో ఓటర్లకు స్లిప్పుల పంపిణీ సాగుతుంది.బీఎల్ఓలు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ స్లిప్పులను ఓటర్లకు అందిస్తున్నారు. అందుబాటులో లేని, వలస వెళ్లిన, చనిపోయిన ఓటర్ల జాబితా తయారు చేయాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సిబ్బందికి ఆదేశించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

కనగల్: మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, వాస్తు హోమం సాయంత్రం గ్రామస్తులతో పాలు, నీళ్లతో మూల విరాటుకు స్వయంగా అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

కనగల్ : మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ కంఠమహేశ్వర సూరమాంబాదేవి, వనం మైసమ్మ, వనం ఎల్లమ్మల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.లక్ష, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ రూ.5లక్షల విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. అదేవిధంగా బీజేపీ కో కన్వీనర్ పిల్లి రామరాజు హాజరై మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామదేవతలను పూజించినప్పుడే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన అల్లోజు రాజుతో పాటు పలువురు యువకులు శుక్రవారం నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి, నారబోయిన బిక్షం, ఒడుపుల శంకర్, భీమనపల్లి నగేష్, విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

హలియా : జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 21న నిర్వహించిన అథ్లెటిక్ 100 మీటర్ల పరుగు పందెంలో హాలియా ఆకాంక్ష స్కూల్ విద్యార్థి అఖిల్ ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్, ప్రిన్సిపాల్ మోదాల రవీందర్, వైస్ ప్రిన్సిపాల్ కరీం శుక్రవారం తెలిపారు. ఈనెల 27, 28తేదీల్లో సూర్యాపేట జిల్లాలోని శ్రీ డిగ్రీ కళాశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో అఖిల్ పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

కిషోర్‌ను విమర్శించడం సరికాదు

నల్లగొండ టూటౌన్ : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను గుత్తా అనుచరులు విమర్శించడం సరికాదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. శుక్రజువారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాదరి కిషోర్‌పై గుత్తా సుఖేందర్‌రెడ్డి అనుచరులు అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. సమావేశంలో కట్ట శ్రీనివాస్, శోభన్ బాబు, నాగరాజుగౌడ్, నాగయ్య పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ఇండోర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు



నల్లగొండలోని ఎన్విరాల్ట్ పార్కులో ఆటలాడుతున్న చిన్నారులు

- స్విమ్మింగ్ చేస్తూ, పార్కుల్లో సేదదీరుతున్న ప్రజలు
- వేసవిలో సరాదాగా గడుపుతున్న పిల్లలు, పెద్దలు
- పంచతత్వ పార్కులో ఆటలు... యోగాసనాలు



పార్కులో చిన్నారిని ఆడిస్తున్న మహిళ

నల్లగొండ టూటౌన్ : ప్రస్తుత వేసవిలో నీలగిరి పట్టణంలోని పిల్లలు, పెద్దలు పార్కుల్లో ఆహ్లాదకరంగా గడుపుతూ, స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ సరదాగా గడపుతున్నారు. వేసవి కాలం కావడం, పాఠశాలలకు సెలవులు రావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని ఉదయం, సాయంత్రం సమయాల్లో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కనున్న పంచతత్వ పార్కు, అన్నపూర్ణ క్యాంటీన్ పార్కు, పెద్ద గడియారం సెంటర్‌లోని గ్రీనరీలో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల్తో కలిసి ఇండోర్ స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్నారు.

అధ్యంతం ఆహ్లాదకరం

నీలగిరి పట్టణంలోని పంచతత్వ పార్కులో పిల్లలకు కావల్సిన గ్రీనరీ, ఆట వస్తువులు, ఇసుకలో దూకడానికి అనుకూలంగా దంప్ లాంటివి ఉన్నాయి. దీంతో పిల్లలను తీసుకొని పెద్దలు పార్కుకు ఉదయం, సాయంత్రం పూట వెళ్తున్నారు. పంచతత్వ పార్కుతో పాటు అన్నపూర్ణ క్యాంటీన్ దగ్గర సైతం పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, గ్రీనరీ ఉండడం ఆహ్లాదకరంగా కనిపిస్తోంది.



నీలగిరి పట్టణంలోని పంచతత్వ పార్కులో యోగాసనాలు వేస్తున్న సాధకులు

అదే విధంగా పెద్ద గడియారం సెంటర్ మధ్యలో గ్రీనరీ పచ్చదనంతో ఉండడంతో పట్టణ ప్రజలు, పిల్లలు ఇక్కడ సాయంత్రం వేళ సేదదీరుతున్నారు.

పంచతత్వ పార్కులో యోగాసనాలు

పట్టణంలోని పంచతత్వ పార్కులో యోగా చేసుకోవడానికి అనుకూలమైన వాతావరణం కలిసివస్తోంది. ఇక్కడి ప్రహరీ కూడా యోగాకు సంబంధించిన వివిధ రకాల ఆసనాల బొమ్మలు కూడా మున్సిపల్ అధికారులు వేయించారు. కొత్త వారు సైతం ఈ యోగసనాల చిత్రాలను చూసి యోగా చేసేంత సులభంగా అవి కనిపిస్తున్నాయి. దాంతో పిల్లలతో కలిసి పెద్దలు కూడా ఇక్కడ యోగాసనాలు వేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

స్విమ్మింగ్ నేర్చుకుంటున్నా..



వేసవి సెలవులు కావడంతో ఇండోర్ స్టేడియం వచ్చి స్విమ్మింగ్ నేర్చుకుంటున్నా. ప్రతి ఒక్కరికీ ఈ వచ్చి ఉండాలి. ప్రతి రోజు గంట పాటు స్విమ్మింగ్ చేస్తున్నా. వేసవి కావడంతో సాయంత్రం వేళ నీటిలో ఈత కొట్టడం ద్వారా మనసు చాలా ప్రశాంతంగా ఉంటుంది.
– చైత్ర, చిన్నారి, నల్లగొండ

పార్కు ఆహ్లాదకరంగా ఉంది



పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో ప్రతి రోజు పిల్లలను తీసుకొచ్చి పంచతత్వ పార్కులో ఆటలు, ఆడుతూ ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. పార్కుకు చాలా మంది పిల్లలు వస్తుండడంతో వాళ్లంతా చాలా సరదాగా ఆడుతున్నారు. పార్కు వాతావరణం కూడా చాలా బాగుంది.
– వెన్నెల, మహిళ, నల్లగొండ

యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చు



ప్రతి రోజు పంచతత్వ పార్కుకు వచ్చి యోగా నేర్చుకుంటున్నా. వివిధ రకాల యోగాసనాలతో శరీరం తేలిక అవుతుంది. ఎలాంటి ఒత్తిడిలు వచ్చినా యోగాతో వాటిన్నంటిని అధిగమించవచ్చు. యోగాతో అనారోగ్య సమస్యలు దరిచేరవు. మనసు ప్రశాంతంగా ఉంటుంది.
– ఆలంపల్లి శేఖర్, నల్లగొండ

తాగునీటి బోరును పరిశీలించిన అధికారులు

- నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ డీఈఈ హామీ

సాక్షి ఎఫెక్ట్..



శాలిగౌరారం : ఎండిపోయిన బోరును పరిశీలిస్తున్న అధికారులు

శాలిగౌరారం: మండలకేంద్రంలో ఎండిపోయిన గ్రామపంచాయతీ తాగునీటి బోరును ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ పద్మలతో కలిసి మిషన్ భగీరథ డీఈఈ నర్సింహ శుక్రవారం పరిశీలించారు. 15 రోజుల క్రితం తాగునీటి బోరు ఎండిపోవడంతో ప్రజలు నీటి కోసం పడుతున్న అవస్థలపై సాక్షి దినపత్రికలో శుక్రవారం గుక్కెడు నీటికి కరువే! శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల అధికారులతో పాటు మిషన్ భగీరథ జిల్లా అధికారులు స్పందించి బోరును పరిశీలించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డీఈఈ నర్సింహ మాట్లాడుతూ ఎండిపోయిన తాగునీటి బోరులోని మోటార్‌ను ఆన్ చేసి పరిశీలించగా మోటారు ఆగిపోస్తుందన్నారు. దీంతో పైపులైన్లలో గాలి ఏర్పడి నీటి సరఫరాకు ఇబ్బందిగా మారనున్న నేపథ్యంలో బోరుమోటార్ వద్ద ఎయిర్‌వాల్వ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పైపులైన్‌లలోని లీకేజీలను సరిచేసి తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు వేసిన బోరు నీటిని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు మండలకేంద్రంలోని మెయిన్‌రోడ్డువెంట ఉన్న పైపులైన్‌కు జతచేసి నీటి సరఫరా చేసేందుకు సమాయత్తమవుతున్నామన్నారు. మిషన్ భగీరథ తాగునీటిని సాధ్యమైనంతమేర ఎక్కువ సమయం సరఫరా జరిగేలా చూస్తామన్నారు. అధికారుల వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్, సిబ్బంది ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యేల పరామర్శ

శాలిగౌరారం: మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకుడు బోడ అశ్విన్ సతీమణి అశ్రిత(37) నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. గురువారం పాఠశాల విధులకు హాజరైన ఆమె తిరిగి ఇంటికి చేరుకొని అనారోగ్యానికి గురై అకస్మాత్తుగా మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వేర్వేరుగా సందర్శించారు. అశ్రిత మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేల వెంట నాయకులు కందాల సమరంరెడ్డి, పాదూరి శంకర్‌రెడ్డి, అన్నెబోయిన సుధాకర్, బండపల్లి కొమరయ్య, భూపతి అంజయ్య, బండారు మల్లయ్య, తీర్పారి మల్లయ్య, చిత్తలూరి వెంకన్న, విజయ్, దానయ్య ఉన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చిట్యాల: చిన్నారులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ గ్రంథాలయ సమాచార కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్ కోరారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని గ్రంథాలయం ఆధ్వర్యంలో చిన్నారులకు ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ శిబిరం మే 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో చిన్నారులకు స్టోరీ టెల్లింగ్, డ్రాయింగ్‌లో శిక్షణ, తెలుగు, ఇంగ్లిష్, గణితంలో బేసిక్స్ నేర్పించటంతో పాటు పలు రకాల ఇండోర్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి



కేతేపల్లి : తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

మర్రిగూడ : పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడే భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం అహర్నిషలు కృషి చేసే సీపీఎం అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. దేశంలో నిత్యావసర వస్తువులు ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాంపల్లి చంద్రమౌళి, నీలకంఠం రాములు, శంకర్, నరేష్, దామెర లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడే జహంగీర్‌ను గెలిపించాలి

కేతేపల్లి : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే భువనగిరి పార్లమెంట్ సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశంలో బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చాక పేదలు మరింత పేదలుగా మారారని, రైతులు కూలీలుగా మారారని ఆవేదనవ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రవేటు పరం చేయటం కోసం బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొజ్జ చిన్న వెంకులు, చింతపల్లి లూర్దు మారయ్య, లకపక రాజు, గూడపూరి వెంకటయ్య, బొప్పని నాగేందర్, పాల్వాయి సైదులు, శాంతమ్మ, భాషమ్మ, పాల్వాయి ఉపేందర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ విఫలం



అయాబ్‌నగర్‌లో ఓటర్లను అభ్యర్థిస్తున్న నగేష్

చిట్యాల: దేశంలో కార్మిక, రైతుల, పేద ప్రజల సమస్యలు పరిష్కరించడంలో బీజేపీ విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ విమర్శించారు. చిట్యాలలోని అయాబ్‌నగర్‌లో సీపీఎం భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎం.డి.జహంగీర్‌కు మద్దతుగా శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మండల నాయకులు శీలా రాజయ్య, గొకుల వెంకట్‌రెడ్డి, రమేష్, లక్ష్మీ, ఖాసీం, గౌసియా, షరీఫ్, శ్రీను, యాదమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తాం

- స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్



నల్లగొండలోని ఎన్జీ కళాశాల వద్ద కరపత్రాలతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రభాకర్

నల్లగొండ టౌన్ : నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో తనకు ఓటువేసి అధిక మెజార్టీతో గెలిపించాలని నల్లగొండ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి, ప్రజాస్వామ్య ఫోరం జిల్లా కన్వీనర్ చొల్లేటి ప్రభాకర్ కోరారు. నల్లగొండలోని ఎన్జీ కాలేజీ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించి మాట్లాడారు. తాను రాజ్యాంగాన్ని నమ్ముకుని ఎన్నికల బరిలో నిలిచానని పేర్కొన్నారు. తనను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో చొల్లేటి రాజేశ్వరి, రంగయ్య, శ్రావణి పాల్గొన్నారు.

గడువులోగా.. కోరిన సమాచారం ఇవ్వాలి

- సమాచార హక్కు సలహా సహాయ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రుషికేశ్వర్‌రాజు

మిర్యాలగూడ : సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకుంటే గడువులోగా సమాచారం ఇవ్వాలని సమాచార హక్కు సలహా సహాయ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సరికొండ రుషికేశ్వర్‌రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపుల వేలం విషయంలో సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మున్సిపల్ కార్యాలయంల ఎదుట వంద ఆర్టీఐఏ దరఖాస్తులతో ఆ సంఘం కార్యకర్తల ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకోని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రుషికేశ్వర్‌రాజు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపుల వేలంలో ఒక్కొక్కరు రూ.25వేల డీడీలు కట్టి పాటలో పాల్గొన్నారని అన్నారు. వేలం పాటలో షాపులు దక్కించుకున్న వారు మిగిలిన పగిడి అమౌంట్ సుమారు రూ. 1.50కోట్లు కట్టడానికి సుమారు ఆరేళ్లుగా కార్యాలయం చుట్టు తిరుగుతున్నా పట్టించుకోకుండా మున్సిపాలిటికీ వచ్చే ఆదాయాన్ని అధికారులు గండికొడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాల్లో పీఐఓలు, అప్పిలేట్ అధికారులు దరఖాస్తుదారులపట్ల న నిర్లక్ష్యం వహించకుండా అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పందిరి అజయ్, అంబటి వీరహనుమాన్, రాజశేఖర్, నారాయణస్వామి, వెంకట్‌రెడ్డి, మహేష్, వెంకటేష్, శశి, ప్రీతం పాల్గొన్నారు.

దైవభక్తితోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : దైవభక్తితోనే ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం మండలంలోని పామనగుండ్ల గ్రామంలో నూతనంగా రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవిందర్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, మాద లింగస్వామి, బండారు కృష్ణ, కనుకుల ధర్మారెడ్డి, ఎంపీటీసీ పాలడుగు హరికృష్ణ ఉన్నారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల: సూర్యాపేట నుంచి బీబీనగర్ వైపు అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం చిట్యాల పోలీసులు వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జాంపల్లి గ్రామానికి చెందిన గనావత్ దిలీప్ సూర్యాపేట చుట్టుపక్కల గ్రామాల్లో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన ఇరవై క్వింటాళ్ల బియ్యాన్ని అశోకా లీలాండ్ వాహనంలో లోడ్ చేసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో చిట్యాల పట్టణంలోని భువనగిరి ఎక్స్ రోడ్డులో పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. బియ్యం అక్రమ రవాణా చేస్తున్న దిలీప్‌ను పోలీసులు ప్రశ్నించగా బీబీనగర్ పరిసర ప్రాంతాల్లో కోళ్ల ఫారాల యజమానులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ : రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తిరందాసు విష్ణు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఉపాధి లేక ఆకలి చావులు మళ్లీ మొదలయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి చేనేత కార్మికులకు చేయూతనంధించి ఉపాధి మార్గం చూపించి ఆత్మహత్యల నివారణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత ర్మిక కుటుంబాలకు తక్షణమే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారిని ఆదుకోవాలని కోరారు. లేనట్లయితే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.


బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

రామగిరి(నల్లగొండ): ఆపదలో ఉన్న బాల్య స్నేహితుడికి అతని మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. తిప్పర్తి మండల పరిధిలోని జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముచ్చపోతుల సోమయ్య కుమారుడు శంకర్(27) ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేశాడు. పదేళ్ల క్రితం అందరిలాగే ఉన్న శంకర్‌కు హఠాత్తుగా కాళ్లు పనిచేయడం లేదు. దీంతో తల్లిదండ్రులు పలు మార్లు హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. అప్పటి నుంచి మంచానికే పరిమితమైన శంకర్‌కు నెల క్రితం కిడ్నీ సమస్య కూడా ఉన్నట్లు గుర్తించారు. కాళ్లు సరిగా పని చేయని కుమారున్ని చూసుకోవడానికి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు సాయంగా ఇంటి వద్దే ఉంటున్నారు. ఎటూ తోచని శంకర్ వాట్సప్ సోషల్ మీడియాలో తన పరిస్థితిని వివరిస్తూ వీడియో పోస్ట్ చేశాడు. దీంతో తనతో పాటు 10వ తరగతి చదువుకున్న మిత్రులు ముందుకు వచ్చి అత్యవసర సాయంగా శుక్రవారం అతని నివాసంలో రూ. 30 వేలు అందజేశారు. చిన్ననాటి మిత్రుడికి సాయం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్త చేస్తున్నారు.

ఒక్కొక్కటి ఒక్కోచోట!



మునుగోడులో అద్దె భవనంలో కొనసాగుతున్న మునుగోడు సబ్ పోస్టాఫీసు



కోఆపరేటివ్ బ్యాంకు కార్యాలయం



ఐబీ సబ్ డివిజన్ కార్యాలయం

- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజల ఇబ్బందులు
- అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా చూడాలని విజ్ఞప్తి

మునుగోడు: పాలకులు, అధికారులు మారినా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో నేటికి ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఇప్పటికీ చాలా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఐబీ సబ్ డివిజన్ కార్యాలయం, సబ్‌పోస్టాఫీసు, కో–ఆపరేటివ్ బ్యాంకు, టెలికమ్‌సబ్ ఎక్స్ఛేంజ్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో కార్యాలయం ఒక చోట ఉండటంతో ప్రజలకు నడక కష్టాలు తీరడం లేదు. కార్యాలయాలన్ని ఒకే చోట ఉంటే అన్ని పనులు వెను వెంటనే పూర్తి చేసుకొని తిరిగి ఇంటికి వెళ్లే వారమని, ఒక్కోటి ఒక చోట ఉండటంతో సమయం వృథా అవుతోందని మండల ప్రజలు వాపోతున్నారు. కో–ఆపరేటివ్ బ్యాంకు రూ 7,000, టెలికమ్‌సబ్ ఎక్స్ఛేంజ్‌కు రూ.5,000, సబ్‌పోస్టాఫీసుకు రూ.3,500, ఐబీ డివిజన్ కార్యాలయానికి దాదాపు రూ.5,000ల చొప్పున చెల్లిస్తున్నారు. ఇలా ప్రతి నెలి అన్ని కార్యాలయాలకు కలపి దాదాపు రూ.50 వేలకు పైగా అద్దె చెల్లించాల్సి వస్తుంది. అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు లేక పోవడంతో అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ కార్యాలయాలు మారుతుండటంతో ప్రజలు ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియకుండా పోతుంది. పలు కార్యాలయాలకు కనీసం బోర్డును కూడా ఏర్పాటు చేయకుండా నడిపిస్తున్నారు. ఇప్పటికై నా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయించి అన్ని కార్యాలయాలను ఒకే చోట నిర్మింపచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.